Nabiyon-ke-Haalaat- IV
(Telugu)

# దైవప్రవక్తలు

## (నాలుగవ భాగం)

## హజ్రత్ మూసా (అలైహిస్సలాం) జీవిత చరిత్ర


మూలం

మౌలానా అబూ సలీం అబ్దుల్ హై

అనువాదం

ముహమ్మద్ ఇక్బాల్ అహ్మద్



HYDERABAD

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002.

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# ఈజిప్టులో ఇస్రాయీల్ సంతతి

దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్(అలైహిస్సలామ్) తన తండ్రి హజ్రత్ యాఖూబ్ (అ)ను, తన సోదరులనందరినీ సిరియా నుండి ఈజిప్టుకు పిలిపించుకున్న విషయం పాఠకులు, హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్)గాథలో చదివే ఉన్నారు. ఆ రోజుల్లో ఈజిప్టులో సామాన్య పౌరులంతా ముష్రికులే (దేవునికి ఇతరులను సహవర్తులుగా నిలబెట్టేవారు). వారు అనేక దేవతల్ని పూజించేవారు. "ఆమన్‌ర" అనే సూర్యదేవతను వారు తమ పెద్ద దేవతగా కొలిచేవారు. వారు తమ చక్రవర్తులను దైవాంశ సంభూతులని తలంచేవారు. దేవుడు పాదుషా రూపంలో భూమికి దిగి వస్తాడనే నమ్మకం వారిలో కలిగించబడింది. అందువల్ల వారిచేత రాజులకు పూజలు జరిపించబడేవి. వీరు రాజులను ఫిర్‌ఔన్‌లు అనేవారు. ఫిర్‌ఔన్ అంటే సూర్యదేవత అని అర్థం. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్) తన కుటుంబంవారిని ఆ బహు దైవారాధకులకు దూరంగా ఒకచోట నివాసం కల్పించారు. హజ్రత్ యాఖూబ్(అ)కు కూడా, తన సంతానం ఆ విగ్రహారాధకులతో కలిసి కాఫిర్లు అయిపోతారేమోననే విచారం పట్టుకుంది. ఆయన తన అవసానదశలో ప్రత్యేకంగా తమ కుటుంబంలోని వారందర్నీ పిలిచి, "చూడండి! నా తరువాత మీరు మీ విశ్వాసాన్ని చెడగొట్టకండి. బహుదైవా రాధకుల ఆచారాలను పాటించకండి" అని హితబోధ చేశారు. "అల్లాహ్ మార్గంలో స్థిరంగా ఉంటామ"ని వారందరి వద్ద ప్రమాణాలు తీసుకున్నారు. ఈ సంఘటనను దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా ప్రస్తావించాడు.

యాఖూబ్(అ) మృత్యుదశలో తన సంతానాన్ని పిలిచి అడిగాడు, "బిడ్డలారా! నా తరువాత మీరు ఎవర్ని ఆరాధిస్తారు?" వారంతా సమాధానం చెప్పారు, "మీరూ, మీ పెద్దలయిన ఇబ్రాహీమ్, ఇస్మాయీల్ మరియు ఇస్‌హాఖ్

ఎవరినైతే దైవంగా భావించారో, ఆ ఒక్క దైవాన్నే మేమూ ఆరాధిస్తాము, మేము ఆయనకే ముస్లిములమై ఉంటాము". (అల్ బఖర: 133)

హజ్రత్ యాఖూబ్(అలైహి)ను 'ఇస్రాయీల్' అని కూడా అనేవారు. కాబట్టి ఆయన సంతతివారు 'బనీ ఇస్రాయీల్ వంశీయులు' అని పిలువ బడ్డారు. ఇస్రాయీల్ సంతతివారి ఎన్నో కుటుంబాలు ఈజిప్టులో నివసించ సాగాయి. వారి సంఖ్య పెరిగినకొద్ది ఈజిప్టులో వారొక శాశ్వత జాతిగా పరిగణించ బడేవారు. సుమారు 400 ఏండ్ల తరువాత దైవప్రవక్త హజ్రత్ మూసా(అలైహిస్స లామ్) ఈ జాతిలో జన్మించారు. ఆ 400 ఏండ్ల వ్యవధిలో ఇస్రాయీల్ సంతతి వారి స్థితి చాలా దిగజారిపోయింది. ఒకవైపు వారి విశ్వాసంలో మాంద్యం ఏర్ప డింది. ధర్మం (ఇస్లామ్) బలహీనమవసాగింది. మరోవైపు వారి ఆర్థికస్థితి క్షీణించ సాగింది. క్రమంగా అదొక బానిస జాతిలా అయిపోయింది. ఈజిప్టువారు రాజ్య మేలగా ఇస్రాయీల్ వంశీయులు వారికి సేవకులుగా, బానిసలుగా మారి పోయారు. అన్నివిధాలా హీనులైపోయారు వారు. అధికారం, సిరిసంపదలు ఈజిప్టువారి హస్తగతమయ్యాయి. వారు ఇస్రాయీల్ జాతిపై అనేక విధాలుగా జులుం చేసేవారు. అంతేకాదు, ఈజిప్టు రాజు ఫిర్ఔన్, బనీ ఇస్రాయీల్ శక్తి సామర్థ్యాలు, వారి జనాభా పెరగడాన్ని సహించలేక పోయేవాడు. వీరు అధిక సంఖ్యాకులయితే శత్రుపక్షాన చేరి తన దైవత్వ పీఠానికి ఎక్కడ ఎసరు పెడతారోనన్న భయం అతనికి ఉండేది కాబోలు. అంచేత ఆ దుష్టుడు వారి శక్తిని అణిచివేయడం కోసం వారిపై పెద్ద మొత్తంలో పన్నులు విధించడమేగాక వారిచేత అడ్డమయిన చాకిరి చేయించడం, ఇంకా పొలాలలో కఠినతరమైన పనులు చేయించి వారి జీవితం దుర్భరం, దుస్సహం చేశాడు. అంతటితో తృప్తి పడక బనీ ఇస్రాయీల్ బలం తగ్గాలంటే వారి సంఖ్యను కూడా తగ్గించాలని నిర్ణయించుకున్నాడు. ఆ దుర్మార్గుడు బనీ ఇస్రాయీల్ వారి ఇండ్లలో దాదులుగా (మంత్రసానులు) పనిచేసే స్త్రీలకు ఓ ఆజ్ఞ జారీ చేశాడు- ఆ ఇండ్లలో మగ పిల్లవాడు జన్మిస్తే వెంటనే గొంతు పిసికి చంపేయమని; ఆడపిల్ల పుడితే ఉండ నివ్వమని!

చాకిరీ చేయించుకోవడానికి బాలికలు చాలని, ఈరకంగా చేస్తే కొంత కాలానికి ఇస్రాయీల్ వంశమే నశిస్తుందని ఫిర్‌ఔన్ ఉద్దేశ్యం.

దీన్నిబట్టి ఆనాటి ఈ రెండు జాతుల స్థితిగతులు ఎటువంటివో అర్థం చేసుకోవచ్చు. ఓవైపు కొద్దిమంది ముస్లిములు- ఇస్రాయీల్ వంశీయులు- ఎవరి ధార్మిక విశ్వాసం అయితే సన్నగిల్లిందో, వారిలో ఎన్నో చెడులు చోటు చేసు కున్నప్పటికీ ఈజిప్టువారికి ఇష్టమయిన పంథాలో నడవడానికి వారు ఎంతమాత్రమూ సిద్ధపడలేదు. మరోవైపు దేవతల్ని పూజించే ముష్రిక్ జాతి. దేశంలో జీవించడానికి ఒకే జాతికి హక్కు గలదని, రెండో జాతివారిని ఏవిధంగానైనా తుదముట్టించాలని కృతనిశ్చయమై ఉన్న జాతి. అటువంటి అపవిత్ర లక్ష్యం కోసం ఈజిప్టువారు అన్నిరకాల కుయుక్తుల్ని ఆచరణలో పెట్టసాగారు. కొట్టడం, తిట్టడం, దోచుకోవడమైతే సరేసరి. ఇప్పుడు వారిని సమూలంగానే తుడిచిపెట్టాలని నిర్ణయించుకున్నారు- అంతటి నాజూకు పరిస్థితులలోనూ దిగజారిపోతున్న ఒక జాతికి అల్లాహ్ ఉన్నతిని ప్రసాదించాడు. జులుం చేసేవారి శక్తిని నిర్వీర్యం చేసి పతనావస్థలో ఉన్నవారిని పైకి లేవనెత్తాడు. గర్వాంధకారంతో విర్రవీగేవారు మట్టి కరవాల్సివచ్చింది.

ఈ విషయాలన్నీ హజ్రత్ మూసా(అలైహిస్సలామ్) గాధలో వస్తాయి. ఒక జాతి హీనదశకు, క్షీణ దశకు ఎందుకు చేరుతుందో, దాన్ని అవమానం, అష్టకష్టాల నుండి కాపాడి ఐహిక ప్రపంచంలోనూ ఉన్నత శిఖరాగ్రానికి చేర్చే పరిస్థితులేవో పాఠకులకు సవివరంగా తెలియగలవు. అంతేకాదు, దైవధిక్కారానికి పర్యవసాన మేమిటో సమయం వచ్చినప్పుడు ఒక అగ్రరాజ్యం ఎలా నలిపి దూరంగా గిరవాటు వేయబడుతుందో కూడా ఈ గాధలో విశదం కాగలదు.

## రాజమహలులో పెంపకం

ఈజిప్టు రాజు ఫిర్‌ఔన్, ఇస్రాయీల్ వంశంలో మగపిల్లలు పుట్టగానే చంపివేసి వారి వంశ నాశనానికి పూనుకున్నాడు. కాని దైవలీల చూడండి- సరిగ్గా ఆ కాలంలోనే హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) జన్మించారు. ఎవరి చేతులపై

సుదూర భవిష్యత్తులో ఫిర్‌ఔన్ అంతం కావాల్సి ఉందో, ఎవరి శిక్షణ ద్వారా బనీ ఇస్రాయీల్ వంటి బలహీన జాతికి ప్రపంచాధిపత్యం లభించనున్నదో ఆ మహావ్యక్తే జన్మించారు. ఇంకా, మూసా(అలైహి) ఆ పట్టణంలోనే జన్మించారు- ఎక్కడయితే ఫిర్‌ఔన్ రాజ్యమేలుతున్నాడో, మరెక్కడయితే ఇస్రాయీల్ సంతతిని పుట్టగానే చంపివేయమనే శాసనం అమల్లో ఉన్నదో, జనన సమయంలో ఆయన తల్లి దాదిని పిలువలేదో లేక మరేం జరిగిందో గాని హజ్రత్ మూసా(అలైహిస్సలామ్) జన్మించారు. ఆయన పుట్టగానే, రాజభటులు వచ్చి పిల్లవాణ్ణేం చేస్తారో అని తల్లికి భయమేసింది. ఆమె ఈ విషయంలో చింతిస్తూ ఉండగా దైవసందేశం వినిపించింది.

"ఎంతమాత్రం భయపడవలసిన పనిలేదు. నువ్వు పిల్లవాడికి పాలు పట్టు. ఒకవేళ ఎప్పుడయినా ఎటువంటి భయం కలిగినా పిల్లవాణ్ణి నిస్సంకోచంగా నదిలో వదిలిపెట్టు, మేమతన్ని తిరిగి నీ ఒడిలోనే చేర్చనున్నాము. ఇంకా అతణ్ణి దైవప్రవక్తగా చేయనున్నాము."

ఈ సందేశం విన్నాక హజ్రత్ మూసా(అలైహి) తల్లి మనసు కాస్త కుదుటపడింది. ఆమె అల్లాహ్‌పై భారం వేసి పిల్లోణ్ణి ఒక పెట్టెలో పడుకోబెట్టి నదిలో విడిచిపెట్టేసింది. వెంటనే తన కూతురితో (హజ్రత్ మూసా(అలైహి) అక్కతో), "చూడమ్మా, నీవు నది ఒడ్డునే నడుస్తూ, ఈ పెట్టె ఎక్కడకు పోతుందో గమనించు". మూసా (అలైహి) సోదరి నది ఒడ్డు నుండి నదిలో పోతూ ఉన్న ఆపెట్టెను అనుసరించసాగింది.

ఆ పెట్టె నదిలో ప్రవహిస్తూ పోయి ఫిర్‌ఔన్ మహలును సమీపించింది. ఫిర్‌ఔన్ సేవకులు ఆ పెట్టెను ఒడ్డుకు తీసుకువచ్చి పెట్టెను తెరచి చూడగా లోపల ఓ చిన్నారి బాబు కేరింతలు కొడుతున్నాడు. ఆ బాలుడు ఎవరి పిల్లవాడో వారికి తెలీదుగా! పిల్లవాణ్ణి ఎత్తుకుని మహలులోనికి తీసుకువెళ్ళారు. ఆ పిల్లవాడు ఇస్రాయీల్ సంతతికి చెందినవాడు కావచ్చు అన్న అనుమానం ఫిరౌన్‌కు కలిగింది. బాలుణ్ణి చంపివేయాలని నిశ్చయించాడు. కాని ఫిర్‌ఔన్

భార్య అందగస్తుడయిన ఆ బాలుణ్ణి చూసి ముచ్చట పడింది. బహుశా ఆమెకు పిల్లలు లేరేమో, ఆ బాబును పెంచుకోవాలని ఉబలాటపడింది. ఆమె ఫిర్ఔన్‌తో, "చూడండి! ఈ పిల్లోడు మన కంటి వెలుగులా అగుపిస్తున్నాడు. ఇతణ్ణి చంపనక్కరలేదు. వీడి వల్ల మనకేదయినా లాభం చేకూరవచ్చు లేదా మనమే ఇతన్ని పెంచుకోవచ్చు" అంది.

ఎవరిని పెంచుకోవాలని తలపోస్తున్నారో వారికేం తెలుసు? ఒక పక్క ఫిర్ఔన్‌కు తానే దైవాన్ననే అభిప్రాయం ఉంది. మరోవైపు అతడు భవిష్యత్తులో తన వంశపార్యంపర్య దైవత్వభాండం బద్దలుకొట్టబోయేవాణ్ణి, ఫిర్ఔన్ పదవికే చరమగీతం ఆలపించేవాణ్ణి తన మహలులోనే పెంచుకోవడానికి సిద్ధమవుతున్న విషయం ఫిర్ఔన్ గ్రహించకపోవడం గమనార్హం.

దేవుడు చేసే ఏర్పాట్లు కూడా బహు విచిత్రంగా ఉంటాయి. ఆయన ప్రజ్ఞను ఎవరెరుగు? ఏ ప్రభుత్వాన్ని కూకటివేళ్ళతో పెకిలించాలో, బూటకపు దైవత్వ దర్పాన్ని ఎలా అణచాలో, దానికి ఎటువంటి అంతర్గత విషయ పరిజ్ఞానం కావలసి ఉందో అదంతా హజ్రత్ మూసా(అలైహి)కెలా లభ్యమవుతుంది? ఇస్రాయీల్ వంశీయులు ఈజిప్టులో అత్యంత అధములుగా పరిగణించబడుతున్న రోజుల్లో ఆయన బాల్యం, పోషణ ఏర్పాటు రాజమహలులోనే గనక జరగకపోతే దేశ రాజకీయాలు, రాజుగారి ఆంతరంగిక విషయాలు తెలుసుకునే అవకాశం బనీ ఇస్రాయీల్ కుర్రవాడికి ఎలా లభిస్తుంది!?

ఇటు ఫిర్ఔన్ , అతని భార్య ఆ పిల్లవాణ్ణి పెంచుకునేందుకు నిశ్చయించుకున్నారు. అటు, మూసా(అలైహి) తల్లికి, తన బాబును రాజమహలులోకి తీసుకెళ్ళారని తెలియగానే ఆమెలో ఆరాటం ఎక్కువ కాసాగింది. అల్లాహ్ ఆమెపై అసాధారణ కరుణ చూపి ఆదుకున్నాడు గనక సరిపోయింది. లేకపోతే, కడుపు తీపి కొద్దీ ఆమె అన్నీ మరిచిపోయి, 'ఈ పిల్లవాడు నా కొడుకే' అని చెప్పివేసేది. అల్లాహ్ ఆమెకు ఓర్పునూ, సహనాన్ని ప్రసాదించాడు. ఆమె ఎంతో ఓరిమి వహించినా, ఫిర్ఔన్ మనుషులు పిల్లవాడిని ఏం చేశారో, కాస్త చూసి రమ్మని తన కూతురిని పురమాయించింది.

ఇక అల్లాహ్ చేసే ఏర్పాట్లు చూడండి. రాజు, రాణి పిల్లవాణ్ణి పెంచుకోవాలని నిశ్చయించుకోగానే ఆ పసికందుకు పాలు పట్టే స్త్రీకోసం అన్వేషణ ప్రారంభమయింది. ఎందరో స్త్రీలు వచ్చారు. కాని పిల్లవాడు ఎవరి పాలనూ ఇష్టపడలేదు. ఈ విషయం మూసా(అలైహి) సోదరికి తెలిసింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. "మీ కోసం పిల్లవాణ్ణి ప్రేమాదరాలతో పెంచే కుటుంబాన్ని వెతకమంటారా?" అని ఆమె అడిగింది.

ఫిర్‌ఔన్ మనుషులు ఆ ఆదుర్దాతోనే ఉన్నారు కదా! వెంటనే ఒప్పుకున్నారు. మూసా(అలైహి)గారి తల్లి పాలు త్రాగించేందుకు పిలువబడింది. ఇక ఆవిధంగా మూసా(అలైహి) తిరిగి తన తల్లి ఒడిలోకి చేరుకున్నారు. ఆ తల్లి కళ్ళు చల్లబడ్డాయి. ఆమె దుఃఖం దూరమయింది. అల్లాహ్ వాగ్దానం ఎంత సత్యమయినదో ఆమెకూ తెలిసివచ్చింది.

హజ్రత్ మూసా(అలైహి) రాజమహలులో పెరగసాగారు. రాకుమారుల్లాగా ఆయనకు విద్యాబుద్ధులు గరిపే ఏర్పాట్లు జరిగాయి. పెరిగి పెద్దవారయ్యారు. కాని ఆయనపై రాజమహళ్ళలోని దురలవాట్లు ఏవీ అబ్బలేదు. రాకుమారులకు సర్వసాధారణంగా సంక్రమించే ఏ దురలవాటూ ఆయన దరిచేరలేదు.

ఇదంతా అల్లాహ్ అసాధారణ కరుణా కటాక్షాల ఫలితమే. హజ్రత్ మూసా(అలైహి) దైవప్రవక్త కానున్నారు. కనుకనే ఆయనకు ప్రసాదించబడిన మేథోసంపత్తి, ఉన్నత ప్రవర్తనల ద్వారా కేవలం సత్ప్రభావమే ఆయనపై పడింది. రాజకుటుంబాలలో పెరిగేవారిలో సర్వసాధారణంగా జనించే చెడులకు ఆయన పూర్తిగా దూరమయ్యారు.

## ఖిబ్తీ హత్య

మూసా(అలైహి) పెరిగి పెద్దవారయ్యారు. ఒకరోజు రాత్రి ఆయన అందరూ నిద్రకు ఉపక్రమించే వేళ బజారుకు ఏదో పనిమీద వెళ్ళారు. ఒకచోట

ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడటం చూశారాయన. వారిని సమీపించగా వారిలో ఒకడు తన జాతికి చెందినవాడు, మరొకడు ఫిర్‌ఔన్ జాతికి చెందినవాడు. హజ్రత్ మూసా(అలైహి) జాతికి చెందిన ఇస్రాయీలీయుడు ఆయన్ని చూడగానే ఫిర్యాదు చేశాడు- తరతరాలుగా ఫిర్‌ఔన్ జాతికి చెందినవారు- ఖిబ్తీలు[1] ఇస్రాయీల్ వంశస్తుల్ని బాధిస్తూనే ఉన్నారుగదా, ఆ ఇస్రాయీల్ వంశస్థుడు మొరపెట్టుకోగా హజ్రత్ మూసా(అలైహి) తన జాతికి చెందిన వ్యక్తిపై జులుం జరుగుతుందని తలపోశారు. ఖిబ్తీని దుష్టుడుగా భావించి అతన్ని ఒక్క గుద్దు గుద్దారు. ఆ దెబ్బకు ఖిబ్తీ నేలకూలాడు. ఇస్రాయీలీయుడిపై దౌర్జన్యం జరుగుతున్నదని భావించిన హజ్రత్ మూసా(అలైహి) ఖిబ్తీని శిక్షించే ఉద్దేశ్యంతో కొట్టారేగాని వాణ్ణి చావ గొట్టాలన్న ఉద్దేశ్యం ఆయనకు ఎంత మాత్రం లేదు. ఖిబ్తీ చనిపోయి నందుకు ఆయన ఎంతో విచారించారు. ఆ తర్వాత తెలిసింది అసలు సంగతి- ఖిబ్తీ చేసిన తప్పేమీ లేదు, తప్పంతా ఇస్రాయీలీయునిదేనని. ఆయన మరింత కృంగి పోయారు. ఆయన గద్గద స్వరంతో, "నా వల్ల ఒక షైతాన్ చేష్ట జరిగి పోయింది." అంటూ వెంటనే అల్లాహ్‌ను క్షమాభిక్ష కోరారు. తౌబా చేశారు (పశ్చాత్తాపం చెందారు) "ఓ ప్రభూ! ఇంకెప్పుడూ ఏ నేరస్తుణ్ణి సమర్థించను. నీవు నన్ను క్షమించి నాపై దయ చూపావు."

అల్లాహ్ మానవుల మనసుల్లోని మర్మం ఎరిగినవాడు. మూసా(అలైహి) ఉద్దేశపూర్వకంగా హత్య చేయలేదని ఆయనకు తెలుసు. యాదృచ్ఛికంగా అపోహపడినందువల్లనే ఇలా జరిగింది కనుకనే దైవం ఆయన మన్నింపును స్వీకరించి ఆయన తప్పిదాన్ని క్షమించాడు.

మరునాడు కూడా మూసా(అలైహి) బజారుకు వెళ్ళినప్పుడు ఆ ఇస్రాయీలియుడే మరో వ్యక్తితో ఘర్షణ పడుతున్నాడు. అతను మళ్ళీ మూసా (అలైహి) సహాయం కోరాడు. "నువ్వొక జగడాలమారివి, ప్రతి ఒక్కరితో పోట్లాడుతావు" అన్నారు మూసా(అలైహి).

---

1. ఈజిప్టులోని ప్రాచీనుల్ని ఖిబ్తీలు అని అంటారు.

మూసా (అలైహి) వారి తగవుకు కారణం అరాతీయుగా ఈ రోజు ఇస్రాయీల్ వంశస్థునిపైనే దౌర్జన్యం జరిగిందని తెలిసింది. ఖిబ్తీ దౌర్జన్యం చేస్తున్నాడు. మూసా(అలైహి) బాధితుడికి సహాయపడే ఉద్దేశ్యంతో అడుగు ముందుకు వేశారు. ఇస్రాయీల్ వంశీయుడు బహుశా మూసా(అలైహి) తననే కొట్టవస్తున్నారని భావించి కంగారుగా, "ఏయ్ మూసా! నిన్న ఒక మనిషిని చంపినట్లే నన్ను కూడా చంపాలనుకుంటున్నావా? నీ ధోరణి చూస్తుంటే, దేశంలోకెల్లా పెద్ద దుండగునిగా కావాలని నువ్వు నిశ్చయించుకున్నట్లుంది. (ప్రజల్ని) సంస్కరించాలన్న ఉద్దేశ్యమే నీకు లేనట్లుంది" అన్నాడు. అతనా మాటలు అనగానే ఖిబ్తీకి, అంతకుముందు రోజు జరిగిన హత్యకు కారకులెవరో తెలిసిపోయింది. ఈ విషయం నిమిషాల్లో ఊరంతా ప్రాకిపోయింది.

మూసా(అలైహి)కు తామంటే ఇష్టంలేదని ఆయన ప్రవర్తన ద్వారా ఫిర్ఔన్ దర్బారువారు గమనించి ఉండవచ్చు. ఫిర్ఔన్‌కు కోపం కలిగించడానికి మూసా (అలైహి) చేసిన ఈ ఒక్క పని చాలు. రాచకుటుంబానికి చెందిన ఒక వ్యక్తికి వ్యతిరేకంగా ఇస్రాయీల్ జాతివాణ్ణి- బానిస జాతివాణ్ణి- మూసా(అలైహి) సమర్థించడాన్ని వారు సహించలేకపోయారు.

దీని సాకుతోనే మూసా(అలైహి)ను తుదముట్టించాలని ఫిర్ఔన్ అంతరంగీకులు పన్నాగాలు పన్నసాగారు. కాని చెడ్డవాళ్ళున్న చోటే ఎవరో ఒకరు మంచివారు కూడా ఉండకపోరు. వారిలోని వాడే అయిన ఒక వ్యక్తి- పురుషులందు పుణ్య పురుషులు వేరయా అన్నట్లు- మూసా(అలైహి)లోని సద్గుణాలను తెలిసినవాడవటం వల్ల, ఈ హత్య స్వరూప స్వభావాలు కూడా ఎరిగినవాడు గనక హుటాహుటిన హజ్రత్ మూసా(అలైహి) వద్దకు వెళ్ళి ఫిర్ఔన్ దర్బారులో జరిగే కుట్రను గురించి ఆయన చెవిన వేశాడు. "ఫిర్ఔన్ సలహాదార్లు నిన్ను తుదముట్టించాలని కుట్రపన్నుతున్నారు. నేను నీ శ్రేయాన్ని కాంక్షించేవాడిని గనక చెబుతున్నాను. నా సలహా మేరకు నువ్వు పట్టణం విడిచి దూరంగా ఎక్కడికైనా పారిపో".

మూసా(అలైహి) ఇది విన్న వెంటనే ఆ నగరం విడిచిపెట్టారు. వెనుక నుంచి ఎవరయినా వచ్చి పట్టుకుంటారేమో అని భయపడ్డారు. అల్లాహ్‌ని ఈవిధంగా ప్రార్థించారు.

"ఓ ప్రభువా! ఈ దుష్టుల బారి నుండి నన్ను రక్షించు."

నిజమే, విశ్వాసి అన్నివేళలా అల్లాహ్‌నే ఆశ్రయిస్తాడు.

## మద్‌యన్(యమన్)లో శిక్షణ

మూసా(అలైహి) ఈజిప్టు నుండి బయలుదేరి మద్‌యన్ (యమన్) వైపుకు సాగిపోయారు. ఈ ప్రదేశం ఎర్ర సముద్రానికి తూర్పు వైపున, ఫిర్‌ఔన్ రాజ్యానికి వెలుపల ఉంది. ఇక్కడ నివసిస్తున్నవారు హజ్రత్ ఇబ్రాహీమ్(అలైహి) వంశానికి చెందినవారే. ఆవిధంగా వారు హజ్రత్ మూసా(అలైహి)కు దగ్గరి బంధువులే. అందుకే కాబోలు, ఆయన తగిన ప్రదేశంగా నిర్ణయించుకున్న ఈ ప్రాంతాన్ని చేరుకోవడానికి ఆయత్తమయ్యారు. మూసా(అలైహి) ఒంటరిగా పయనమయ్యారు. తోడుగాని, సహాయకులుగాని ఎవరూ లేరు. పైగా శత్రువు వెనుక నుండి వచ్చి చుట్టుముట్టే భయం అనుక్షణం వెంటాడుతోంది. కాని హజ్రత్ మూసా(అలైహి) హృదయంలో, "నా ప్రభువు నన్ను సరయిన మార్గం (సన్మార్గం)లోనే నడిపిస్తాడు" అనే విశ్వాసం దృఢమైంది. అందుకే నిస్సంకోచంగా ముందుకు సాగారు.

అలా నడుస్తూ నడుస్తూ ఆయన మద్‌యన్(యమన్)కు చెందిన ఒక బస్తీ సమీపానికి చేరుకున్నారు. అక్కడ ఒక బావి ఉంది. బావి వద్ద చాలామంది గుమిగూడి తమ తమ పశువులకు నీరు త్రాగిస్తూ ఉన్నారు. అక్కడే కాస్త దూరంలో ఇద్దరు బాలికలు తమ పశువుల్ని నిలబెట్టి నిరీక్షిస్తూ కనిపించారు. మూసా(అలైహి) వారితో, "ఏం మీరిలా దూరంగా ఎందుకు నిలబడ్డారు?" అనడిగారు.

"ఈ పశువుల కాపరులు వారి పశువుల్ని నీరు త్రాగించనిదే మేమెలా త్రాగించగలం? వారికంటే మేము బలహీనులము, మా నాన్నగారు కూడా ముసలివారు" అన్నారా బాలికలు.

బలవంతులు, బలహీనుల హక్కులను దోచుకోవడాన్ని హజ్రత్ మూసా (అలైహి) చూచి సహించలేకపోయారు. వెంటనే ఆయన ఆ పశువులను బావి దగ్గరకు తీసుకెళ్ళి నీరు త్రాగించారు. పశువులు నీరు త్రాగాక ఆయన దగ్గర్లోని ఒక చెట్టు నీడను ఆశ్రయించి తన ప్రభువుతో, "ఓ ప్రభూ! నీవు నా వైపు పంపే శ్రేయస్సును కాంక్షిస్తున్నాను" అని వేడుకున్నారు.

చూడ్డానికిది చాలా చిన్న విషయమే. దైవప్రవక్త మూసా(అలైహి) బలహీనులయిన బాలికలకు సాయపడ్డారు. వారి పశువులకు నీరు త్రాగించారు సరే! అదొక సత్కార్యం చేశారు. అయితే కాస్త సావధానంగా ఆలోచించినట్లయితే, అల్లాహ్ ఈ చిన్న విషయం ప్రసక్తి తీసుకువచ్చి ఒక పెద్ద వాస్తవాన్ని మానవులకు స్పష్టం చేశాడని అర్థమవుతుంది. మొదటి విషయం; గాలి, నీరు, సూర్యరశ్మి, వర్షం, సముద్రాలు, కొండలు, దానంతట అదే మొలిచే గడ్డి, అడవులు, భూమి లోని నిక్షేపాలు మొదలగునవి దైవప్రసాదితాలు గనక, వాటిని అనుభవించడానికి మానవుడు ఎలాంటి శ్రమ పడనవసరంలేదు. కనుక అవి ఓ ప్రత్యేక వ్యక్తి యొక్క వ్యక్తిగత ఆస్థి కాకూడదు. ఇలాంటి పదార్థాల పంపకంలో "కర్ర గలవాడిదే బర్రె" అనే సిద్ధాంతం సరయినదికాదు. ఇవి సాధారణంగా మానవుల అవసరాలను బట్టి పంపకం కావాలి. కాని కల్లోలం అసలు ఇక్కణ్ణుంచే ఆరంభమవుతుంది. తమ కున్న బలంచేత కొందరు వ్యక్తులు దైవానుగ్రహాల్ని చేజిక్కించుకుని, ఇతరుల హక్కుల పట్ల నిర్లక్ష్యం చేయడం జరుగుతుంది. దైవసమ్మతమైన జీవన వ్యవస్థ మాత్రమే మానవుల్ని ఈ శాపం నుండి విముక్తిని ప్రసాదిస్తుంది. మూసా(అలైహి) భవిష్యత్తులో ఇటువంటి వ్యవస్థనే సుస్థాపితం చేయవలసి ఉంది. అందుచేతనే బలవంతులు బలహీనుల హక్కుల్ని దోచుకోవడాన్ని ఆయన సహించలేక పోయారు.

ఆ బాలికలు ఇంటికి వెళ్లి తండ్రికి జరిగిన విషయమంతా వివరించారు. కృతజ్ఞతాభావం వెల్లివిరియగా తమ కుమార్తెలకు సహాయపడిన ఆ సానుభూతి పరుణ్ణి కలుసుకోవాలని తలచాడా తండ్రి. ఆ యువకుణ్ణి తన దగ్గరికి పిలుచుకు రమ్మని ఒక అమ్మాయిని పంపారు. ఆ బాలిక మూసా(అలైహి) దగ్గరకు వచ్చి, "మా పశువులకు నీరు త్రాగించి మాకు చేసిన మేలుకు కృతజ్ఞతగా ప్రతిమూల్యం చెల్లించేందుకు మా నాన్నగారు మిమ్మల్ని పిలుస్తున్నారు" అన్నది.

మూసా(అలైహి) ఆ బాలిక వెంట నడిచారు. ఆ బాలికల తండ్రితో తన గాధనంతా చెప్పుకున్నారు. అంతా విని ఆయన "మీరేమీ భయపడనవసరం లేదు. నిశ్చింతగా ఉండండి. ఇక మీరు ఆ దుర్మార్గుల కబంధ హస్తాల నుండి విముక్తి పొందినట్లే" అన్నారు.

వారి ఇంటనే మూసా(అలైహి) కొన్నాళ్ళు ఆగారు. ఒకరోజు ఇద్దరు కుమార్తెలలో ఒకామె తండ్రితో, "ఆ యువకుణ్ణి మన వద్ద ఎందుకు కొలువు ఉంచుకోరాదూ! పైగా బలవంతుడూ, అమానతుదారుడు అయిన నౌకరే కదా మనకు కావాల్సింది!!" అన్నది. ఈ ప్రతిపాదన ఆ తండ్రికి ఎంతో నచ్చింది. ఆయన బాగా ఆలోచించి ఒక మంచి నిర్ణయానికి వచ్చారు. ఓరోజు ఆయన మూసా(అలైహి)తో అన్నారు, "నా ఇద్దరమ్మాయిలలో ఒకామెను నీకిచ్చి నికాహ్ (వివాహం) జరిపించాలనుకుంటున్నాను. అయితే ఒక షరతు, నువ్వు ఎనిమిదేండ్లు నా దగ్గర ఉద్యోగం చేయాలి. ఒకవేళ పదేళ్ళు గనక పూర్తిచేస్తే నువ్వు నాకు మేలు చేసినవాడవవుతావు. అలా అని నీపై ఎక్కువ భారం వెయ్యడం నాకు ఇష్టం లేదు కూడా. దైవచిత్తమయితే ఈ వ్యవధిలో నీవు నన్నొక మంచి మనిషిగా గుర్తిస్తావు. హజ్రత్ మూసా(అలైహి) ఆ పెద్దాయన చేసిన ప్రతిపాదనకు తన అంగీకారం తెలుపుతూ, "మనిద్దరి మధ్య ఈ ఒప్పందాన్ని నేను అంగీకరిస్తున్నాను. ఈ రెండు గడువుల్లో మీరు కోరిన గడువును పూర్తి చేయడానికి నాకేమీ అభ్యంతరం లేదు. మనం ఏ ఒప్పందమయితే కుదుర్చుకుంటున్నామో దానికి అల్లాహ్‌ను సాక్షిగా చేసుకుందాం. ఆయన మీదే మనకు విశ్వాసం" అన్నారు.

ఆ బాలికల తండ్రి దైవప్రవక్త హజ్రత్ షుఐబ్(అలైహి)యే అని అంటారు. అల్లాహ్ చేసే ఏర్పాట్లు చూడండి! ఇప్పటివరకు మూసా(అలైహి)ను ఫిర్ఔన్ దర్బారులో పెంచాడు. దేశ రాజకీయ వ్యవహారాల్ని, అందలి మెలకువల్ని నేర్చుకునే అవకాశం ఆయనకు కల్పించాడు. ఇక ఇప్పుడు మరో ఎనిమిది లేక పది సంవత్సరాలు మరొక ప్రవక్త సహచర్యంలో గడిపే వీలు కల్పించాడు. వాస్తవానికి ఈ 8 లేక 10ఏళ్ళ వ్యవధి కేవలం మేకల్ని, ఒంటెల్ని మేపడానికి మాత్రమే కాదు. అల్లాహ్ తన ఏ ఉన్నత కార్యం కొరకయితే హజ్రత్ మూసా(అలైహి)ను ఎన్నుకున్నాడో దానికోసం ఆయన్ని సన్నద్ధం చేయవలసి ఉన్నది. ఇదొక తర్ఫీదు కాలమన్న మాట.

# దైవదౌత్యం

హజ్రత్ మూసా(అలైహి) నౌకరీ చేయవలసిన గడువు పూర్తయింది. వివాహం కూడా జరిగిపోయింది. అప్పులు ముఖ్యంగా సోదరుడు హారూన్(అలైహి)ను చూడాలని మనస్సు తహతహలాడింది. దాంతో మూసా(అలైహి) స్వదేశం వెళ్ళడానికి నిర్ణయించుకున్నారు. మామగారి అనుమతితో, భార్య వెంటరాగా ఈజిప్టుకు పయనమయ్యారు. దారిలో ఒక అద్భుత సంఘటన-

చీకటి రాత్రి, మంచు బాగా కురుస్తోంది. ఎటు వెళుతున్నారో దారి తెలియటం లేదు. అకస్మాత్తుగా ఆయనకు కొండ మీద అగ్ని మంట కనిపించింది. ఆయన తన అర్థాంగితో, "నువ్విక్కడే ఉండు, నేను వెళ్ళి కొద్దిసేపట్లో నిప్పు తీసుకువస్తాను. దాంతో నువ్వు చలి కాచుకోవచ్చు. ఆ మంట దగ్గర ఎవరయినా కనబడితే బహుశా దారి కూడా తెలుసుకోవచ్చు" అని ఆమెను అక్కడే విడిచి మంట కనబడిన వైపుకు వెళ్ళారు.

హజ్రత్ మూసా(అలైహి) నిప్పు తెచ్చుకోవాలన్న ధ్యాసతో ముందుకు సాగిపోతున్నారు. దైవధర్మాన్ని గురించి ఆయనకు ఏ మాత్రం తెలియదు. నిజమే, తనకు ప్రవక్త పదవి లభించనుంది అని ఆయనకు మాత్రం ఏం తెలుసు? మంట

ఎదురుగా కనబడుతోంది. దగ్గరగా వెళ్ళేసరికి ఎవరో పేరు పెట్టి పిలిచారు, "ఓ మూసా!" అని. ఆయన ఉలిక్కిపడ్డారు. తెలిసినవారు ఎవరూ లేనిచోట, నన్నెరిగినవాళ్ళు, పేరుపెట్టి పిలిచేవాళ్ళు ఎవరయివుంటారా? అని ఆలోచనలో పడ్డారు. అంతలో మరోసారి అదే పిలుపు!

"మూసా! నీ ప్రభువును నేనే. పాదరక్షలు విడువు. ఇప్పుడు నీవు పవిత్ర మైన తువా లోయలో ఉన్నావు. ఇటు చూడు! నిన్ను ప్రవక్త పదని కోసం ఎన్ను కున్నాను. ఇప్పుడు నేను చెప్పేదంతా సావధానంగా విను.

"నేనే అల్లాహ్‌ను, నేను తప్ప ఆరాధనీయులు ఎవరూ లేరు. కాబట్టి నన్నే ఆరాధించు.

"నా స్మరణ కోసం నమాజ్‌ను స్థాపించు."

"ఖియామత్ (తుది దినం) తప్పక వస్తుందని నమ్ము. కాని నేను ఆ విషయాన్ని గుప్తంగా ఉంచాను. తద్వారా ఎవరు ఎలా పనిచేస్తారో తెలిసిపోవాలని అలా చేశాను."

"మరణానంతరం ప్రతి వ్యక్తికి అతని కర్మల ప్రతిఫలం ఇవ్వబడు తుంది."

"ఇంకా విను, ఒకవేళ ఎవరయితే ఆరోజు వస్తుందని విశ్వసించరో, తమ కోర్కెలకు దాసులై ఉంటారో, వారు నా ఆరాధనా విధేయతల నుండి నిన్ను నిరోధిస్తారేమో!"

"ఒకవేళ నువ్వలా చేస్తే, నాశనమైపోతావు." (సూరయె తాహా)

మూసా(అలైహి) ఆ మాటలు విన్నారు. తనకు ఎటువంటి గౌరవోన్న తులు ప్రసాదించబడుతున్నాయో గ్రహించారు. మానవులందరిలో తనకు ఎంతటి అత్యున్నత స్థానం లభించబోతున్నదో, దాంతోపాటు తనపై మోపబడు తున్న బాధ్యత ఎటువంటిదో కూడా ఆయన తెలుసుకున్నారు. హజ్రత్ మూసా (అలైహి) మౌనంగా నిలబడి వినసాగారు.

ఒకవేళ ఆయనతో సూటిగా ఒక ప్రశ్న వేయబడకుండినట్లయితే బహుశా ఆయన అలాగే మౌనదశలో నిలబడి ఉండేవారేమో!

సరే, అల్లాహ్ ప్రశ్న, దానికి మూసా(అలైహి) జవాబు చదివేముందు, కాస్త ఆ వహీ(దైవ సందేశం) ఏమిటో తెలుసుకుందాం. మూసా(అలైహి)ను ఎన్నుకుని, ఆయన ద్వారా ఇతర మానవాళికి అందజేయబడనున్న ఆ దివ్య సందేశాన్ని అర్థం చేసుకుందాం.

అన్నింటికన్నా ముందు, ఈ శబ్దం ఎవరిదో, ఎక్కణ్ణుంచి వస్తున్నదో పరి చయం చేయబడింది. ఇంకా మూసా(అలైహి) నిలబడి ఉన్న స్థలం ఏ ప్రాంతం లోనిదో తెలుపబడింది. దివ్యఖుర్ఆన్‌లో మరొక చోట ఇదే విషయాన్ని ఇలా కూడా ప్రస్తావించడం జరిగింది.

ఆయన మంటకు దగ్గరగా వెళ్ళినప్పుడు ఇలా వినబడింది: "మంట దగ్గర ఉన్నవానికి, ఇంకా, ఇదంతా జరుగుతున్న ఆ పరిసర ప్రదేశానికి శుభం కలుగుగాక!

"ఇహపర లోకాల ప్రభువైన అల్లాహ్ అన్నిరకాల చెడుల నుండి పవిత్ర మయినవాడు - ఓ మూసా! నిన్ను పిలుస్తున్నది నేనే- నేనే అల్లాహ్‌ని, గొప్పవాణ్ణి, అత్యంత వివేకవంతుణ్ణి".

ఈ పరిచయం తర్వాతే, ముమ్ముందు చెప్పబడే విషయానికి ప్రాముఖ్యత లభిస్తుంది. ఇక్కడ దేవుడు మూసా(అలైహి)కు ఒక కార్యం అప్పగిస్తున్నాడు. తనకు వినయ విధేయతలు ప్రకటించమని అడుగుతున్నాడు. వినేవాడు చెప్పేవాణ్ణి గుర్తించనట్లయితే ఆ మాటలన్నీ అర్థరహితమే.

ఇక్కడ మరో విషయం కూడా గమనించండి. భూమ్యాకాశాలు, సూర్య చంద్రులు, గాలి, మేఘం, వర్షం, భూమిపై మొలిచే మొక్కలు, పశువులు, పక్షులు, క్రిమికీటకాలు, స్వయంగా మానవుని ఉనికి, అతని శరీర నిర్మాణం, అతని మనుగడకు కావలసిన ఆధారాలు, అతని ఆహార సామగ్రి, నీరు గాలి ఒకటేమిటి సృష్టిలో అణువణువు కూడా సాక్ష్యమిచ్చే విషయమేమంటే-

ఇదంతా (సృష్టి)తనకుతానుగా ఉనికిలోనికి రాలేదు, దాని సృష్టికర్త ఒకడున్నాడు. ఈ సృష్టి అంతా ఎంత చక్కగా, మరెంత నియమబద్ధంగా నిర్వ ర్తించబడుతున్నదో గమనిస్తే, ఈ విశ్వ వ్యవస్థను నడిపేవాడు, దాని నియమా వళిని రూపొందించిన వాడు అసాధారణ శక్తిసంపన్నుడని, అసామాన్య వ్యూహ రచనా గరిష్టుడని ఒప్పుకోక తప్పదు. సృష్టికర్త, యజమానిని గుర్తించే, తెలుసు కునేందుకు అవసరమైన సామగ్రి ప్రతి మానవునికి అతని చుట్టుప్రక్కల ఎంతగా వ్యాపించి ఉన్నదంటే, అతడు ఏ విధమయిన శిక్షణ, సలహాల ప్రమేయం లేకుండానే అతని మస్తిష్కంలో ప్రభువు, యజమాని యొక్క భావన ఏ కాస్తయినా వచ్చి తీరుతుంది. ఆలోచించవలసిన విషయమేమంటే, ఒక వ్యక్తిపై ఎల్లప్పుడూ దేవుని కరుణాకటాక్షాల వర్షం వర్షిస్తూ ఉంటే అతను ఇదంతా ఏర్పాటు చేసేవారెవరూ లేకుండానే జరుగుతున్నదని భావించడంగాని, ఒకరి పోషణకు కావలసిన ఏర్పాటు, ఆలోచించినకొద్దీ సంభ్రమాశ్చర్యాలు కలిగే అద్భుత రీతిలో జరుగుతూ ఉంటే, అతడు ఇదంతా ఏ పరిపోషకుడు లేకుండానే జరుగుతున్నదనే నిర్ణయానికి రావడంగాని, లేదా సృష్టిలోని ప్రతి వస్తువూ, ఒక నియమానికి లోబడి, ఒక నిర్ణీత విధానం ప్రకారం పని చేస్తూ ఉండటాన్ని చూసిన వ్యక్తి ఇదంతా ఏ ప్రభువూ, ఏ నిర్వాహకుడూ లేకుండానే దానంతట అదే నడుస్తోందని అనుకోవడం మానవ స్వభావానికే వ్యతిరేకం. ఈ కారణం చేతనే ప్రతికాలంలోనూ మానవుడు ఈ సత్యాన్ని గుర్తించాడు, కనుగొన్నాడు. మానవుడు తన మనోకాంక్షలకు బానిసై లేదా తన భావోద్రేకాలకు లోనై కేవలం మంకుతనం కారణంగా తిరస్కరిస్తే అది వేరే విషయం. మానవుడికి దేవుని అస్తిత్వం గురించి సరయిన పరిచయం కావడానికి ఇప్పటివరకు అడ్డు, అవరోధం అవుతూ వచ్చిన విషయమేమన్నా ఉన్నదా అంటే అది మానవుని వికృత కోరికలు, తప్పుడు భావోద్రేకాలే. కొందరు దేవుని ఉనికినయితే అంగీ కరిస్తారు. కాని అలా దైవాన్ని అంగీకరించినందున అతనికి ఇష్టమయిన పనిని చేయవలసి వచ్చినప్పుడు వారు ఒకవైపు దైవాన్ని విశ్వసిస్తూనే, మరోవైపు తమ వికృత కోరికలను, దుష్ట ఆశయాలను కూడా నెరవేర్చుకుంటున్నారు. లేదా అసలు దైవాన్నే తిరస్కరిస్తారు.

మొదటి తరహా ఆచరణ వల్ల తప్పుడు మతం ఆవిర్భవిస్తే, రెండో తరహా ఆచరణ వల్ల నాస్తికత్వం లేదా భౌతిక ఆరాధన ఉనికిలోనికి వచ్చింది.

దేవుని పరిచయం, గుర్తింపు కోసం ప్రతి మానవుడికి తన బుద్ధిజ్ఞానాలను బట్టి, ఈ సృష్టిలో నలువైపులా సమకూర్చబడి ఉన్న నిదర్శనాలు ముక్తసరిగా దైవత్వ స్వరూపాన్ని సూచిస్తాయి. కాని ఇది మాత్రమే చాలదు. ఆయన ఉనికి, ఆయన గుణవిశేషాల అసలు జ్ఞానం దీని ద్వారా ప్రాప్తం కాదు. అల్లాహ్ తన దాసులపై ఎంతటి దయగలవాడంటే ఆయన వారి సౌలభ్యం కోసం కోట్లాది ఏర్పాట్లు చేశాడు. ఆయన మరో కష్టమైనదాన్ని కూడా సులభతరం చేశాడు.

తన దాసుల కోసం ఆయన తాను పరిచయం చేసిన మానవులలో నుండే కొందరిని ఎన్నుకున్నాడు. వారికి సద్బోధల వెలుగును ప్రసాదించాడు. వారే దైవప్రవక్తలు. వారి ద్వారానే మానవుడు దేవుని అస్తిత్వాన్ని, గుణవిశేషాల సరయిన జ్ఞానాన్ని పొందగలుగుతాడు. అప్పుడే ఆయన ప్రసన్నత, అప్రసన్నతల విషయాల్ని తెలుసుకోగలడు.

అల్లాహ్ హజ్రత్ మూసా(అలైహి)కు అందరికంటే ముందు ఆ పరిచయ భాగ్యాన్నే అనుగ్రహించాడు. ఇంకా, "మేము నిన్ను ఒక ప్రత్యేక కార్యం కొరకు ఎన్నుకున్నాము, ఇక దానికోసం నడుం బిగించు. దానికి సంబంధించిన అవసర మైన సూచనల్ని విను" అనే శుభవార్త ఆయనకు విన్పించబడింది.

అన్నింటికంటే ముందుగా ఆయనకు ఇవ్వబడిన సూచన ఎంత ముఖ్యమైనది!

ఆ సేవ ఏమిటో, దేనికోసమయితే మూసా(అలైహి) ఎన్నుకోబడ్డారో, ముందు వివరంగా తెలియగలదు-

## ఒకవైపు :

- ఫిర్ఔన్ యొక్క తిరుగుబాటు (దైవతిరస్కార) వైఖరి మానవుణ్ణి మానవుడికే దాసునిగా చేసింది. అతని మంత్రి హామాన్ ద్వారా వ్యాప్తిలోకి

తేబడిన (తప్పుడు) మతతత్వపు వలలో మానవుని శరీరమే కాదు, అతని ఆత్మ సయితం చిక్కుకుని ఉంది -ఇంకా

- జాతీయ పెట్టుబడిదారీ వ్యవస్థ క్రింద మానవత విలవిల్లాడుతోంది. ఆ శాపానికి ప్రతినిధి-ఖారూన్- ప్రజాకంటకుడయ్యాడు.

## రెండోవైపు :

ఒక పీడిత జాతి- మార్గభ్రష్టతకు గురయిన ముస్లిమ్ జాతి- స్వదేశస్థుల చేతనే అవమానించబడుతూ, అణిగిపోయి, జీవితం అంటేనే విసిగిపోయిన జాతి. దాన్ని బానిసత్వపు కోరల్లోకి లాగి, దాని రక్తం చివరి బొట్టు వరకు పీల్చివేసినా శత్రువుకు తృప్తి కలగడం లేదు. పైగా ఆ జాతి సంతానాన్నే అంతమొందించే ప్రణాళికలు తయారయ్యాయి.

మూసా(అలైహి) ఒకవైపు ఫిర్ఔన్, హామాన్, ఖారూన్‌లను ఎదుర్కోవాల్సి ఉంది. మరోవైపు వారికి, వారి జాతికీ దైవసందేశం అందజేయాల్సి ఉంది. ఇంకోవైపు అణిచివేయబడిన ఆ జాతిని ఉద్ధరించాలి. ఆ జాతిలోని చెడులను దూరంచేసి మరిచిపోయిన పాఠం గుర్తు చేయవలసి ఉంది- ఆలోచించండి! ఎంత కఠినమైన పని అప్పగించబడుతోందో. అయితే, ఇది కొత్త విషయమేమీ కాదు. ఈ కార్యాన్ని నిర్వర్తించడానికే ఎల్లప్పుడూ ప్రవక్తలు వస్తుండేవారు. ఈ కార్యం పూర్తి చేయడానికి ఆయా ప్రవక్తల అనుయాయులు తమ ప్రాణాలొడ్డి పనిచేశారు.

ఈ ముఖ్యమయిన పనికి ఇవ్వబడే ఉపదేశం (ఉత్తర్వు) ఎంత ముఖ్యమైనదో గమనించండి.

అల్లాహ్ ప్రవచిస్తున్నాడు:

***"లా ఇలాహ ఇల్లా అనా ఫాబుద్‌నీ వ అఖీముస్సలాత లిజిక్రీ"***

''అల్లాహ్ తప్ప మరొక దైవం లేడు. ఆధిక్యత ఆయనకే. బలపరాక్రమాల్లో ఆయన్ని మించినవారు లేరు. కోర్కెలు తీర్చడం, రక్షణ ఇవ్వడం, శాంతిని ప్రసాదించడం ఆయన వల్లనే సాధ్యం. సర్వాధికారి ఆయనే.''

"కనుక దాస్యానికి అర్హుడు ఆయనే. కేవలం ఆయనే. ఆజ్ఞాపించడం ప్రభువు హక్కు, ఆయనకు విధేయత చూపటమే సమంజసం."

యావజ్జీవితమూ ఆయన విధేయతలో స్థిరంగా ఉండటానికి, ఎల్లవేళలా ఆయన ఆజ్ఞల్ని పాలించేందుకు, తన నిజప్రభువు ఎవరో, తాను ఎవరి దాసుడో, ఎవరి దాస్యం, విధేయతలు తనకు తగినవో మానవుడు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. ఇది చాలా అవసరం. ఈ విషయాలన్నీ గుర్తుంచుకోటానికి నమాజ్‌ను సుస్థాపితం చేయడం అవసరం. నమాజ్‌ను సంరక్షించుకోని వ్యక్తి దైవ విధేయతా మార్గంలో ఎన్నటికీ స్థిరంగా ఉండలేడు. నమాజ్ సకల ఆరాధనలకూ మూలం. ఇంకా ఎవరయితే అల్లాహ్‌ను తన ప్రభువుగా అంగీకరించి, ఆయనకే దాస్యం చేయడానికి నిర్ణయించుకుని కూడా నమాజ్‌ను సంరక్షించుకోడో, ఆ వ్యక్తి నిర్ణయంలోనే ఏదో లోటు ఉందన్నమాట.

ఇది ఆ ప్రథమ ఉపదేశానికి తాత్పర్యం. ఈ ఉపదేశమే మానవ సంస్కరణకు మొదటి మెట్టు. ఇది వినా మానవుణ్ణి మానవునిగా మలచడం సాధ్యం కాదు. ఈ మౌలిక అంశాన్ని తిరస్కరించిన మానవుడు అవమానం, ఘోర వైఫల్యం తప్ప మరేమీ పొందలేడు. ఇహలోక విజయానికీ, ఇంకా శాశ్వతమైన పరలోక సుఖశాంతుల కోసం కూడా ఈ నియమాన్నే అనుసరించాలి.

హజ్రత్ మూసా (అలైహి) ఏ ఉద్యమం నిమిత్తం పంపబడుతున్నారో ఆ ఉద్యమం పరిపూర్ణత సాధించడానికి అన్నింటికన్నా మొదటి ఆయుధం ఈ దివ్య దృష్టే. మానవ దైవత్వాన్ని రూపుమాపడం, దురాచారభూయిష్టమయిన మత శాపాన్ని తుదముట్టించడం, సంపద ప్రాతిపదికపై మానవుల రక్తాన్ని పీల్చే పెట్టుబడిదారీ జలగల నుండి మానవాళిని కాపాడటం, ఇంకా అణగారి ఉన్న ఒక పీడిత జాతికి దాని హక్కును ఇప్పించడం- ఇవన్నీ కూడా, (1) మానవుడు మొదట తన ప్రభువు (దైవం)ను గుర్తించి, (2)కేవలం ఆయనకే విధేయత చూపి, దైవాన్ని విస్మరించడం వలన జరిగే అనర్థాల నుండి తన్నుతాను కాపాడుకోవడానికి నమాజ్‌ను స్థాపించడం అత్యవసరమని గుర్తించే వరకూ సాధ్యంకాదు.

జీవితం మరణంతో అంతంకాదు. నాణానికి లాగే జీవితానికి బొమ్మా బొరుసు ఉన్నాయి. ఈ రెంటి మధ్య మరణం హద్దు మాత్రమే. ఆ హద్దుకు ఇవతల సముపార్జనకు, ప్రయత్నానికి వ్యవధి, హద్దుకు ఆవలి ప్రక్క సంపాదించిన ఫలాన్ని అనుభవించే కాలం ఉన్నాయి. ఈ వాస్తవమే గనక మానవుని దృష్టిలో ఉండివుంటే ఏ చెడులను రూపమాపడానికి మూసా (అస్సలామ్) నియమింపబడుతున్నారో ఆ చెడులు అసలు పుట్టేవే కావు. కాని మానవుడు ఈ యదార్థాన్ని విస్మరిస్తున్నాడు. కోర్కెలు అతడి కళ్ళను కప్పేస్తాయి. తాత్కాలికంగా లభించే ప్రయోజనాల మధురిమల్లో అతడు మునిగిపోయి ప్రస్తుతం కంటికి కానరాని "శాశ్వత" జీవితాన్ని మరచిపోతాడు. ఈ మరిచి పోవడమే అతని వినాశానికి కారణం. కోరికలకు బానిసలయినవాళ్ళు, కొత్త రుచుల మైకం కమ్మినవాళ్ళు అంతటితో ఊరుకోరు. తాము నాశనమవడమేకాక తమతోపాటు ఇతరుల కళ్ళు కూడా కప్పడానికి ప్రయత్నించి వారి మార్గంలోనూ అవరోధం కల్పిస్తారు.

ఈ మొట్టమొదటి వహీ (దైవసందేశం)లో హజ్రత్ మూసా (అస్సలామ్)ను, "పరలోకాన్ని విస్మరించిన ఈ ప్రజలు నిన్ను వినాశకర మార్గం లోకి ఈడుస్తారేమో!" అనే ప్రమాదాన్ని కూడా ముందుగా సూచించి హెచ్చరించడం జరిగింది.

హజ్రత్ మూసా(అస్సలామ్)కు ఇవ్వబడిన దైవసందేశాన్ని గమనించండి. ఇందులో మానవులందరికీ గుణపాఠం, మార్గదర్శకం లభింపజేసే సామగ్రి ఎంతో ఉంది.

మూసా(అస్సలామ్) మౌనంగా దైవవాణి వింటూ నిలబడ్డారు. ఇంతలో ఆయన్ని ప్రశ్నించడం జరిగింది.

"ఓ మూసా! నీ కుడిచేతిలో ఏముంది?"

"ఇది నా లాఠీ(కర్ర). ఊతగా దీన్ని ఉపయోగిస్తాను. ఇంకా దీంతో మేకల కోసం ఆకులు రాల్చుతాను. దీంతో నా అవసరాలు ఇంకా ఎన్నోతీరుతాయి." హజ్రత్ మూసా(అలైహి) జవాబిచ్చారు.

"దాన్ని నేల మీద పడవేయి"- ఆజ్ఞ అయింది.

మూసా(అస్సలామ్) ఆజ్ఞను పాటించారు. కర్రను పడవేసిన చోట ఒక పాము అటూ ఇటూ జరజర ప్రాకుతోంది. దాన్నిచూసిన మూసా గాబరాపడి, వెనుదిరిగి పారిపోసాగారు. వెంటనే, "మూసా! ముందుకు వచ్చి దాన్ని పట్టుకో. భయపడకు. నీవు క్షేమంగానే ఉంటావు. చూడు! మేము దానిని తిరిగి మొదట ఎలా ఉందో అలానే చేస్తాము. మా ప్రవక్తలు మా సముఖంలో భయపడరు" అని వినవచ్చింది.

మూసా(అస్సలామ్)ఈ ఆజ్ఞను పాటించారు. ముందుకు అడుగువేసి ఆ పామును పట్టుకున్నారు. ఇప్పుడు పాము మాయమైపోయింది. మూసా (అస్సలామ్) చేతిలో లాఠీ ఉంది. ఎప్పటిలాగానే ఇంతలో మళ్ళీ, "నీ చేతిని కాస్త నీ చంకలో పెట్టుకో, నీ చేయి ఉజ్వలమయిన కాంతిని వెదజల్లు తుంది- ఏమాత్రం లోపం లేకుండా. ఇది నీవు నిజంగా దైవప్రవక్తవని తెలిపే రెండవ చిహ్నాం. నువ్వు వెళ్ళి ఈ రెండు గుర్తుల్ని ఫిర్ఔన్‌కు, అతని దర్బారులోని వారికి, అతని జాతివారికి చూపి, వారిని దైవతిరస్కారం, అవిధేయతల నుండి మర ల్చేందుకు నీ ప్రభువు తరపు నుండి ప్రసాదించబడు తున్నాయి. వారు ఎంతో అవిధేయులు, తిరస్కారులు అయిపోయారు. ముందు ముందు మేము నీకు మరిన్ని మహిమల్ని చూపుతాము" అని వినబడింది.

హజ్రత్ మూసా(అలైహి) దైవప్రవక్తగా నియుక్తమయ్యారు. అంటే మానవులలో అత్యంత ఉన్నతమైన స్థానం ఆయనకు లభించింది. దైవంతో సంభాషించిన ఘనత, ప్రవక్త పదవికి నిదర్శనంగా రెండు మహిమలు ఆయనకు లభించాయి. అయితే ఎవరికి కీర్తి ప్రతిష్టలున్నాయో వారికి బాధ్యతలూ ఉన్నాయి.

ఇప్పుడు మూసా(అస్సలామ్) నిర్వర్తించవలసిన బాధ్యతలను కాస్త చూడండి. నిజానికి ప్రాపంచిక జీవితం ఏ విధంగానూ సుఖశాంతుల జీవితం కాదు. ఈ జీవితం బాధ్యతల్ని నెరవేర్చే గడువు మాత్రమే. విధి నిర్వర్తించవలసిన

సమయం. ఎవరి హోదా ఎంత ఉన్నతమైనదైతే వారిపై బాధ్యత కూడా అంతే ఎక్కువగా ఉంటుంది. హజ్రత్ మూసా(అస్సలామ్)కు ఆజ్ఞాపించబడింది:

"వెళ్ళు, ఫిర్ఔన్ వద్దకు పో. అతనెంతో తలబిరుసుతనాన్ని ప్రదర్శిస్తు న్నాడు. అతని ఆస్థానంలోనివారు, అతని జాతివారు హద్దుమీరిపోయారు. అమిత మయిన అన్యాయాలకు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. "మీకు దైవభయం లేదా?" అని వారిని అడుగు. "నీ జీవితం పవిత్రవంతం కావాలని కోరుకుంటు న్నావా? అయితే నీ నిజప్రభువు, యజమానికి ఇష్టమయిన జీవితమార్గం నీకు చూపనా?" అని ఫిర్ఔన్‌ని అడుగు.

ఈ ఆజ్ఞ వినగానే హజ్రత్ మూసా(అస్సలామ్) భయంతో కంపించి పోయారు. ఎంత పెద్ద బాధ్యత ఆయనపై మోపబడుతోందో!

ఫిర్ఔన్! ఈజిప్టు దేశానికి ఏకైక యజమాని. అతని అధికారాలకు అంతులేదు. అతని చుట్టూ యుక్తిపరులైన సర్దారుల సమూహం ఉండేది. యావజ్జాతి అతని గుప్పిటిలో బంధించబడి ఉన్నది. కనుసైగలతో వారిని ఆడించగలడతను. ఆ కాలంలో మానవ బలం, అధికారం అత్యున్నత స్థాయిలో అతనికి ప్రాప్తమయింది. కాగా, ఇటు హజ్రత్ మూసా(అస్సలామ్) ఏకాకి. అను చరులు ఎవరూ ఆయన వెంటలేరు. అధికారం, డబ్బు సంగతి అటుంచి బ్రతుకు తెరువు కోసం కొన్ని పశువులు తప్ప మరే ఆధారమూ లేదు. పైగా ఎంతో కాలంగా దేశాన్ని విడిచిపెట్టి ఉన్నా ఇప్పటిదాకా పశువుల కాపరిగా జీవితం గడిపినవారు; ఈజిప్టు దేశపు భాషను కూడా దాదాపు మరచిపోయినవారు. అటువంటి ఆయనకు, "వెళ్ళు, ఫిర్ఔన్ దర్బారులో మా సందేశం విన్పించు. అతణ్ణి సన్మార్గంలోకి మరల్చే ప్రయత్నం చెయ్యి" అని ఆజ్ఞాపించబడుతోంది.

"నీవు దేవుడవు కావు, దాసుడవు మాత్రమే. దాసునిగా ఉండటంలోనే నీ శ్రేయస్సు ఇమిడి ఉంది అని అతనితో చెప్పు" అని అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు.

కాని ఈ విశ్వానికి అధిపతి ఎవరో, అతని శక్తిసామర్థ్యాలు ఎటువంటివో, ఆయన ఎంతటి ప్రజ్ఞావంతుడో మూసా(అలైహి)కు తెలుసు. అతని శక్తి ముందు

ఫిర్ఔన్ మరియు అతని బలగం ఎందుకూ కొరగానివి. అటువంటి మహిమాన్వి తుడయిన విశ్వప్రభువు ఆజ్ఞాపిస్తున్నప్పుడు అంతటి శక్తిసంపన్నుని అండ తన కుండగా భయపడవలసిన పనేమిటి? కనుక హజ్రత్ మూసా(అలైహి) వెంటనే సిద్ధమయ్యారు. కాని ప్రార్థించడం భక్తుని లక్షణం. సహాయం కోసం విశ్వ ప్రభువుని అర్థించడం అతనికి శక్తిదాయకం. ఆయన తన రెండు చేతులూ ఎత్తి వినమ్రులై విశ్వప్రభువు ముందు మోకరిల్లి ప్రార్థించారు:

"ఓ నా ప్రభూ! నా హృదయాన్ని విశాలపర్చు, ప్రచార కార్యక్రమంలో ఇబ్బందుల్ని ఎదుర్కొనే శక్తిని ప్రసాదించు, నా పనిని సులభతరం గావించు, ప్రజల హృదయాలను హత్తుకునేలా నా వాక్శోణిని తీర్చిదిద్దు.

"దేవా! నన్ను వీరు అసత్యపరునిగా భావిస్తారేమోనని నాకు భయంగా ఉంది. నా వల్ల ఒక అపరాధం జరిగిపోయిన సంగతి నీకు తెలుసు. వారి మనిషి ఒకడు నా చేత చంపబడ్డాడు. వారు నన్ను చంపివేస్తే నాకు అప్పగించబడిన కార్యం పూర్తిగా నెరవేరదేమో అని విచారిస్తున్నాను.

"స్వామీ! నాకు సాయపడు. మా కుటుంబంలో నుండి నా సోదరుడు హారూన్‌ను నాకు సహాయకారిగా నియమించు, అతని వల్ల నాకు ధైర్యం కలుగు తుంది. అతడు నాకు చేదోడుగా ఉండి, నే చెప్పే మాటలను బలపరు స్తాడు. అతడు నాకన్నా గొప్ప వక్త కూడా. మేమిద్దరం కలిసి ఈ కార్యభారాన్ని నిర్వ హిస్తాము. నీ ఏకత్వాన్ని వీలైనంత ఎక్కువగా చాటి చెబుతాము. ఎల్లవేళలా నీ సేవలో నిమగ్నులమై ఉంటాము."

ఆ విశ్వప్రభువు అభీష్టం నెరవేర్చేందుకు హజ్రత్ మూసా(అలైహి) నడుం బిగించారు. ఆయన అప్పగించిన పనిని పూర్తి చేయడానికి ఆయనతోనే మొర పెట్టుకున్నారు. ఇక చూడండి, ఆయన కటాక్షవీక్షణాలు హజ్రత్ మూసా (అలైహి)పై ఏవిధంగా పడతాయో; సృష్టిలోని అణువణువు ఆయనకు తోడ్పడ డానికి సిద్ధంగా ఎలా కన్పిస్తాయో చూడండి.

హజ్రత్ మూసా(అలైహి) ప్రార్థన అంగీకరించబడింది. "నీ దరఖాస్తు మంజూరు చేయబడింది. మేము నీ సోదరుణ్ణి నీకు కుడిభుజంగా చేస్తాం. మీ

ఇద్దరికీ విజయశ్రీ ప్రసాధిస్తాం. వారి ప్రభావం మీపై ఏమాత్రం ఉండదు. మీరిద్దరిది, ఇంకా ఈ కార్యంలో మిమ్మల్ని అనుసరించేవారిదే పైచేయిగా ఉంటుంది" అని విశ్వప్రభువు సెలవిచ్చాడు. కర్తవ్యదీక్షాబద్ధుడైన తన దాసునితో.

మూసా(అలైహి) నిప్పు తెస్తూ ఉంటారని ఆయన భార్య ఎదురు చూస్తూంది. ఆ వ్యవధిలో పరిస్థితులు ఎలా మారాయో ఆమెకేం తెలుసు? అప్పటివరకూ మేకలను మేపుతూ ఉన్న మూసా(అలైహి)కు ఒక్కసారిగా, మానవాళికంతటికీ సన్మార్గం చూపించవలసిన బాధ్యత ఇవ్వబడింది. సరే, ఏమయితేనేం, మూసా(అలైహి) 'తూర్' కొండ నుండి తిరిగివచ్చి ఈజిప్టు వైపుగా పయనమయ్యారు సపత్నీ సమేతంగా, ఆదిలో సోదరుణ్ణీ, అప్పుల్ని కలుసుకోవాలనే కోరిక ఉండనే ఉంది. కాని ఇప్పుడు ఒక బాధ్యతను స్వీకరించారు. దాన్ని పూర్తి చేయడమే ఆయన శేషజీవిత లక్ష్యమైంది. అదే ఆయన ప్రస్తుత లక్ష్యం.

ఇటు హారూన్ (అలైహిస్సలామ్)ను కూడా దేవుడు ప్రవక్తగా నియమించాడు. ఈజిప్టులో సోదరులిద్దరూ కలుసుకున్నారు. ఇద్దరూ కలిసి చేయవలసిన ధార్మికసేవ వారికి తెలిసినదే. ఇప్పుడు వారికి మరికొన్ని సూచనలివ్వబడుతున్నాయి.

"మీరిద్దరూ ఫిర్ఔన్‌ను కలుసుకోండి. మా నిదర్శనాలను అతడకి చూపండి. ఇంకా మా సందేశం వినిపించండి. ఫిర్ఔన్ చాలా అహంకారి అయినాడు. అతడికి చెప్పవలసినదంతా మృదువుగా చెప్పండి. విషయం అతనికి అర్థం కావచ్చు. అతడు దుష్పర్యవసానానికి భయపడనూవచ్చు."

ఇది విని వారిద్దరూ "ప్రభూ! అతడు మా మాటలు విని మా మీద మండిపడతాడేమో! కోపంతో హద్దుమీరి ప్రవర్తిస్తాడేమో అని మేము భయపడుతున్నాము" అని విన్నవించారు.

అల్లాహ్ వారిద్దరికీ ధైర్యం చెప్పి ఇలా అన్నాడు, "ఏమీ కాదు, మీరు భయపడకండి. మీకు నేను తోడుగా ఉంటాను. నాకు అంతా తెలుసు.

సమస్తమూ నా దృష్టిలో ఉంది. మీరు వెళ్ళి ఫిర్‌ఔన్‌తో, 'మేమిద్దరం నీ ప్రభువు, యజమాని అయిన అల్లాహ్ చేత పంపబడిన ప్రతినిధులం' అని చెప్పండి."

హజ్రత్ మూసా(అలైహి) మరియు హజ్రత్ హారూన్ (అస్సలామ్) తాము దైవప్రవక్తలమని ప్రకటించారు. ఫిర్‌ఔన్ వద్దకు వెళ్ళి వారేమి చెప్పారో తెలుసుకోవడానికి ఇది చాలు. ఇద్దరూ దైవప్రవక్తలు అందజేసే సందేశమే ఫిర్‌ఔన్‌కు అందజేసి ఉండవచ్చు, ఇంకా తూర్ పర్వతంపై మూసా(అలైహి)కు సవివరంగా సూచించబడింది ఈ విషయమే. కాని హజ్రత్ మూసా(అస్సలామ్) కేవలం ఫిర్‌ఔన్ మరియు అతని జాతి కోసమే పంపబడలేదు. బనీఇస్రాయీల్ వారిని (మూసా (అస్సలామ్) జాతివారు) సంస్కరించడం కూడా ఆయన పనే. వీరిలో ఏర్పడిన ధార్మిక బలహీనతను దూరం చేయవలసిన అవసరం కూడా ఉంది. బనీ ఇస్రాయీల్ వారు ఎంతోకాలంగా ఫిర్‌ఔన్ బానిసత్వంలో మ్రగ్గుతూ ఉన్న వారు గనుక బానిస జాతుల ధార్మికత కుంటుపడుతూ రావడం సహజమే కదా! ఎన్నో ధార్మిక విధులు వారు నిర్వర్తించలేకపోయేవారు.

ఇస్రాయీల్ వంశంలో 'ఖుర్బానీ' ఇవ్వడం ముఖ్యమైన ఆరాధనగా ఉండేది. కాని ఫిర్‌ఔన్ వారిని ఆ ఆరాధనకు దూరంగా ఉంచాడు. ఈజిప్టువారు కూడా ఇతర ముష్రిక్ (బహుదైవారాధకులు)ల వలెనే ఆవును పూజించేవారు. అందుచేత ఇస్రాయీల్ వంశీయులకు ఆవును ఖుర్బానీ ఇచ్చే అనుమతి లభించ లేదు. నువ్వు నీ జాతివారిని మూఢవిశ్వాసాల నుండి, అంధకారం నుండి వెలికి తీసి ఇస్లామ్ వాస్తవికత వెలుగులోకి తెమ్మని మూసా(అస్సలామ్), హారూన్ (అస్సలామ్)లకు సూచించిన అల్లాహ్ ఫిర్‌ఔన్‌ను దైవధర్మం వైపు ఆహ్వానిం చడంతో పాటు బనీ ఇస్రాయీల్‌కు వారి ధార్మిక విధులు నిర్వర్తించు కోవడానికి, ముఖ్యంగా పండుగ రోజు వారు సామూహికంగా 'ఖుర్బానీ' ఇచ్చేందుకు అను మతి ఇవ్వమని, ఫిర్‌ఔన్‌ను కోరమని కూడా సూచించాడు. ఇంకా, ఈ పనికి ఈజిప్టు సరయిన స్థలం కాదు గనక, ఇస్రాయీల్ వంశీయులు పండుగ జరుపు కునేందుకు వారిని నగరం వెలుపలకు వెళ్ళనివ్వమని, వారి మార్గంలో

అవరోధాలు కల్పించవద్దని డిమాండు చేయి అని కూడా అల్లాహ్ మూసా (అస్సలామ్)కు సూచించాడు. ఇస్రాయీల్ వంశీయులు ఫిర్ఔన్‌కు, ఫిర్ఔన్ జాతికి సేవకులన్న విషయం విదితమే.

వారు కొన్నాళ్ళపాటు ఎటైనా పోతే ఫిర్ఔన్ జాతికి సేవచేయటానికి చాకిరీ చేసే కూలీలు దొరకరు. కనుక ఫిర్ఔన్‌జాతి వారు వారిని నగరం బయటకు వెళ్ళనివ్వరు. మూసా(అస్సలామ్) ఫిర్ఔన్‌కు చేసిన అభ్యర్థన "తౌరాత్"లో ప్రస్తావించబడింది:

"తరువాత మోషే అహరోనులు వచ్చి ఫరోను చూచి- ఇస్రాయీలీయుల దేవుడైన యెహోవా- అరణ్యములో నాకు ఉత్సవము చేయుటకు నా జనమును పోనిమ్మని ఆజ్ఞాపించుచున్నాడనిరి. ఫరో- నేను అతని మాట విని ఇస్రాయీలీయులను పోనిచ్చుటకు యెహోవా ఎవడు? నేను యెహోవాను ఎరుగను. ఇస్రాయీలీయులను పోనీయననెను. అప్పుడు వారు- హెబ్రీయుల దేవుడు మమ్ములను ఎదుర్కొనెను, సెలవయిన యెడల మేము అరణ్యము లోనికి మూడు దినముల ప్రయాణమంత దూరము పోయి మా దేవుడయిన యెహోవాకు బలి అర్పించుదుము?" (నిర్గమ కాండము (5) 1-3)

దైవప్రవక్తలు ఏ సందేశమయితే ఇస్తారో ఆ సందేశం ఫిర్ఔన్‌కు వినిపించి, దానితోపాటు, "బనీ ఇస్రాయీల్‌ని మా వెంట వెళ్ళనివ్వు, వారికి కష్టాలను కలుగజేయకు. మేము నీ దగ్గరకు నీ ప్రభువు యొక్క నిదర్శనాలను తీసుకువచ్చాము. దైవం పంపిన సందేశాన్ని ఎవరైతే ఆచరిస్తారో వారికే శ్రేయం కలుగుతుందని తెలుసుకో" అని తెలియజేయడానికే అల్లాహ్ వారిద్దరినీ పంపాడు.

హజ్రత్ మూసా (అస్సలామ్) మరియు హజ్రత్ హారూన్ (అస్సలామ్)లు ఈ కార్యం కొరకే పంపబడ్డారు. వారిపై మోపబడిన బాధ్యతలు సంక్షిప్తంగా ఇవి:

- ఫిర్ఔన్‌కు, అతని జాతివారికి, ఫిరౌన్ దర్బారులో మార్గభ్రష్టులయిన సర్దారులకు మొట్టమొదట దేవుని ఏకత్వం, ప్రవక్తల దౌత్యం, పరలోకం గురించి వినిపించాలి. వారిని సన్మార్గం వైపునకు రప్పించే ప్రయత్నం చేయాలి.